క్లుప్తంగా

మంత్రిని కలిసిన మండల నాయకులు



మంత్రితో పర్వతగిరి మండల నాయకులు

వరంగల్(పర్వతగిరి): మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఆయన స్వగృహంలో గురువారం మండల కేంద్రానికి చెందిన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతపట్ల మాలతి సోమేశ్వర్‌రావు, ఎంపీటీసీ మాదుగుల రాజు, ఉపసర్పంచ్ జనార్దన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రంగు కుమార్, నాయకులు గోనె సంపత్, తదితరులు పాల్గొన్నారు.

సదరం శిబిరం



వర్ధన్నపేట: వర్ధన్నపేట ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన సదరం శిబిరంలో గురువారం 87 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి తెలిపారు. అర్హులైన వికలాంగులందరికీ జిల్లా గ్రామీణ సంస్థ కార్యాలయం నుంచి సర్టిఫికెట్లను అందించనున్నట్లు పెన్షన్ విభాగం అధికారులు తెలిపారు. సదరం శిబిరంలో వైద్యాధికారులు ఆర్థో విభాగం డాక్టర్లు వీరేన్, నర్సింహరెడ్డి, వేణు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈశిబిరంలో సదరం విభాగం అధికారులు రవికృష్ణ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థికి అభినందన



తేజస్వినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఖానాపురం: విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని ప్రిన్సిపాల్ రాజేందర్ అన్నారు. మండలంలోని బుధరావుపేట మోడల్ స్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని కోడి ఈశ్వర తేజస్విని నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైంది. ఆమెను గురువారం ప్రిన్సిపాల్ అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్లపాటు విద్యార్థినికి స్కాలర్‌షిప్ రానున్నట్లు తెలిపారు. ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకుని చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను విధానంపై వర్క్‌షాప్



వర్ధన్నపేట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నూతన ఆదాయ పన్ను విధానంపై ఒక రోజు కళాశాల స్థాయి వర్క్‌షాపు నిర్వహించారు. ఈవర్క్ షాపులో విద్యార్థులకు పాత, కొత్త ఆదాయపు పన్ను విధానాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సమత, అధ్యాపకులు డాక్టర్ బి.కవిత, డాక్టర్ పి.మాలతిలత, డి.శ్రీధర్‌రెడ్డి, ఎన్.శ్రీనివాసరావు, డాక్టర్ కె.సంధ్య, బి.శ్వేత, సుధారాణి, డాక్టర్ శ్రీనివాస్, సిబ్బంది రాజయ్య, వాసు, కొమరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభమైన సత్తెమ్మ జాతర



మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

పర్వతగిరి: మండలంలోని ఏనుగల్‌లో సత్తెమ్మ జాతర గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా భక్తులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. రెండో రోజు శుక్రవారం భక్తులు బోనాలు చేసి పట్నాలు వేస్తారు. కార్యక్రమంలో సర్పంచ్ దమ్మిశెట్టి సంధ్యారాణి నర్సింగం, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు గూడ నరేందర్ వర్మ, మాజీ ఉపసర్పంచ్ గుండాలపు సతీశ్‌రావు, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు మాసాని వెంకట్, దూడల మల్లన్న డైరెక్టర్ దుద్దు మహేందర్‌గౌడ్, మాసాని భాస్కర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం

దుగ్గొండి: వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను పరిశీలించడానికి అడవిరంగాపురం గ్రామానికి చేరుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎమ్మెల్యేలు ఘన స్వాగతం పలికారు. నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు ఆకుపచ్చ రంగు శాలువా కప్పి స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, ములుగు జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్, ఎంపీ కవిత, ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేశ్, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపనేని నరేందర్, మాజీ ఎంపీ సీతారాంనాయక్, కలెక్టర్ ప్రావీణ్య, ట్రాన్స్‌కో సీఎండీ గోపాల్‌రావు, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ, డీఏఓ ఉషాదయాళ్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగేందర్, ఆర్డీఓ మహేందర్‌జీ, డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, ఉద్యానవన అధికారి శ్రీనివాసరావు, డీపీఆర్‌ఓ పల్లవి, జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమల, వివిధ శాఖల అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే పెద్ది

ట్రాఫిక్ ఆంక్షలు

సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా మండలంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఆ గ్రామాన్నే ఎందుకు ఎంచుకున్నారంటే..

వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించడానికి నర్సంపేటకు ముఖ్యమంత్రి పర్యటన ఖరారు కావడంతో పంటల పరిశీలనకు అడవిరంగాపురం గ్రామాన్ని ఎంచుకున్నారు. ఇక్కడ జిల్లాలోనే అత్యంత ఎక్కువగా పంట నష్టం సంభవించింది. ఏ ఒక్క పంట అక్కరకు రాకుండా పోయింది. గ్రామంలో 1,654 ఎకరాల భూమి ఉండగా.. 954 మంది రైతులున్నారు. 984 ఎకరాల్లో మొక్కజొన్న పంట నాశనం కాగా.. 209 ఎకరాల్లో వరి, 25 ఎకరాల్లో మిరప, 10 ఎకరాల్లో కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. నివాస గృహాలు దెబ్బతిన్నాయి.



అడవి రంగాపురంలో దెబ్బతిన్న మొక్కజొన్న

బీఎస్పీ నాయకుల ముందస్తు అరెస్ట్

నర్సంపేట రూరల్: ఉమ్మడి జిల్లాలో గురువారం సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా బీఎస్పీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాసాని రమేశ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుర్రి సాగర్, దుగ్గొండి మండల అధ్యక్షుడు వెండి కుమారస్వామి, నల్లబెల్లి మండల అధ్యక్షుడు గాడిపెల్లి రఘుపతి, నాగుర్లపల్లి గ్రామ అధ్యక్షుడు గొర్రె రామస్వామి, మర్రిపల్లి గ్రామ అధ్యక్షుడు రాదారపు దేవరాజు, మారేపల్లి రాజు, నర్సంపేట పట్టణ నాయకుడు శీరంశెట్టి రాజేందర్ తదితరులు ఉన్నారు.



పోలీస్ స్టేషన్‌లో బీఎస్పీ నాయకులు

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి



సంగెం: కంటి వెలుగు శిబిరం ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

సంగెం: కంటి వెలుగు శిబిరాన్ని వినియోగించుకోవాలని సర్పంచ్ పోతుల ప్రభాకర్, ఎంపీటీసీ బానోత్ పద్మ అన్నారు. గురువారం మండలంలోని ఎల్గూర్ రంగంపేటలో ఉచిత కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొమురయ్య, నాయకులు శ్రీనివాస్, అజేయ్‌కుమార్, రమేశ్‌బాబు, వైద్య సిబ్బంది ఉన్నారు.

రాయపర్తి మండలంలో..

రాయపర్తి: కంటి వెలుగు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య కోరారు. గురువారం మండలంలోని కాట్రపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సంధ్యసోమనాథం, ఉపసర్పంచ్ రేణుక, ఏఎన్‌ఎం రేణుక ఉన్నారు.

అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల సర్వే

నర్సంపేట రూరల్: ఇటీవల అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలపై పకడ్బందీగా సర్వే నిర్వహించి నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందించాలని గుంటూరుపల్లి సర్పంచ్ కర్నాటి పార్వతమ్మ అన్నారు. గురువారం నర్సంపేట మండలంలోని గుంటూరుపల్లి గ్రామంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికొచ్చే సమయంలో వడగండ్ల వాన రూపంతో వచ్చి రైతులను నట్టేట ముంచిందన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పకడ్బందీగా సర్వే నిర్వహించి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సంగెం: తీగరాజుపల్లిలో పంట నష్టం అంచనా వేస్తున్న ఏఈఓ తదితరులు

నెక్కొండ మండలంలో..

నెక్కొండ: అకాల వర్షంతో దెబ్బతిన్న పంటల సర్వే గ్రామాల వారీగా చేపట్టనున్నట్లు ఏఓ ఎగిడి నాగరాజు గురువారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 18న రాత్రి కురిసిన వడగండ్ల వానతో మండలంలోని వివిధ గ్రామాల్లో దెబ్బ తిన్న పంటలను నేటి నుంచి 28 వరకు పంట నష్ట వివరాలను సేకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సర్వే చేపట్టనున్న ఏఈఓలకు రైతులు సహకరించాలని ఆయన సూచించారు. శుక్రవారం నెక్కొండ, నెక్కొండ తండా, బంజరుపల్లి, లావుడ్యా వాగ్యా నాయక్ తండా, పిట్టకాలుబోడు తండా, రెడ్లవాడ, అప్పల్‌రావుపేట, వెంకట్‌తండా, పెద్దకొర్పోలు, నాగారం, 25న నెక్కొండ, నెక్కొండ తండా, చంద్రుగొండ, ముదిగొండ, గొల్లపల్లి, మహబూబ్‌నాయక్ తండా, బొల్లికొండ, మడిపెల్లి, అవుసుల తండా, పెద్దకొర్పోలు, సూరిపెల్లి, 26న పనికర, ముదిగొండ, సీతారాంపురం, అజ్మీరా మంగ్యానాయక్ తండా, బొల్లికొండ, వెంకటాపురం, గుండ్రపల్లి, చిన్నకొర్పోలు, 27న నెక్కొండ, నెక్కొండ తండా, దేవునితండా, దీక్షకుంట, సాయిరెడ్డిపల్లి, గొట్లకొండ, అలంకానిపేట, అప్పల్‌రావుపేట, పనికర, చిన్నకొర్పోలు, చెరువుముందరి తండా, 28న పనికర, సీతారాంపురం, రెడ్లవాడ, రెడ్యానాయక్ తండా, తోపనపల్లి, పెద్దకొర్పోలు, నాగారం, నక్కలగుట్ట తండాలలో సర్వే జరుగుతుందని తెలిపారు.

సంగెం మండలంలో..

సంగెం: ఇటీవల కురిసిన వడగళ్ల వానకు దెబ్బతిన్న పంట నష్టాన్ని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గురువారం మండలంలోని తీగరాజుపల్లి, గవిచర్ల, కాపులకనిపర్తి, సంగెం, మొండ్రాయి తదితర గ్రామాల్లో ఆయా క్లస్టర్ ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఏలు పంట క్షేత్రాలను సందర్శించి పంట ఎంత శాతం నష్టపోయిందనే నివేదిక తయారు చేస్తున్నారు. పంట నష్టం నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఏఓ యాకయ్య తెలిపారు.



నర్సంపేట రూరల్: మొక్కజొన్న పంటను సర్వే చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తీన్మార్ మల్లన్నను విడుదల చేయాలని రాస్తారోకో

వర్ధన్నపేట: తీన్మార్ మల్లన్నను అక్రమంగా అరెస్టు చేశారని, అందుకు నిరసనగా మల్లన్న టీం మండల అధ్యక్షుడు ఆకుల మనోజ్ ఆధ్వర్యంలో గురువారం వర్ధన్నపేటలోని అంబేడ్కర్ సెంటర వద్ద వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ప్రతిపక్ష పార్టీల నాయకులతో రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. రాస్తారోకోతో ఇరువైపులా వాహనాలు నిలిచాయి. ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో నాయకులు సమ్మెట సుధీర్, ఎండీ అప్సర్, కొండేటి బాలకృష్ణ, చీటూరి రాజు, మల్లన్న టీం సభ్యులు చిన్న, యాకయ్య, అంబేడ్కర్, శ్రవణ్, అనిల్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తిలో..

రాయపర్తి: తీన్మార్ మల్లన్న అరెస్ట్ సరికాదని, బేషరతుగా విడుదల చేయాలని తీన్మార్ మల్లన్న టీం మండల అధ్యక్షుడు గాడిపెల్లి యాకయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో తీన్మార్ మల్లన్నను విడుదల చేయాలంటూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిర్ర మల్లయ్య, గబ్బెట బాబు, సాంబయ్య, చిర్ర ఎల్లయ్య, గాడిపెల్లి సారయ్య పాల్గొన్నారు.



వర్ధన్నపేట: రాస్తారోకో చేస్తున్న నాయకులు

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

రాయపర్తి: మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన సుదగాని రమేశ్‌గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. గురువారం వీకేపీ యూత్ అసోసియేషన్ నాయకులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా.. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. రూ.7,400లను అందించారు. కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ నాయకులు మంద రాజు, కొనకటి మహేందర్, చీకటి హరీశ్, కొనకటి రాజు, ఏసీరెడ్డి అనిల్, కొనకంటి మునేందర్, కొనకటి శరత్, ఆవునూరి రాకేశ్, సుదగాని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాల ఏర్పాటులో భాగస్వామిని చేయాలి

- దళిత ప్రజా సంఘాల జేఏసీ నాయకులు

నర్సంపేట: నర్సంపేట మోడల్ సిటీలో భాగంగా అంబేడ్కర్ సెంటర్‌లో అంబేడ్కర్ కాంస్య విగ్రహం, పాకాల సెంటర్‌లో విశ్వ ప్రజాకవి జాషువా కాంస్య విగ్రహాల ఏర్పాటు చేయాలని, విగ్రహాల స్థాపనలో దళిత ప్రజా సంఘాల జేఏసీని భాగస్వామి చేయాలని పట్టణ దళిత ప్రజా సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అంబేడ్కర్, జాషువా కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేస్తామని, దళిత ప్రజా సంఘాల జేఏసీ భాగస్వామ్యం ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ గద్ద వెంకటేశ్వర్లు, కో కన్వీనర్ కల్లెపల్లి ప్రణయ్‌దీప్, తడుగుల విజయ్‌కుమార్, జేఏసీ కో కన్వీనర్లు గుంటి వీరప్రకాశ్, డ్యాగల శ్రీనివాస్, సాంబరాతి మల్లేశం, జేఏసీ గౌరవ సలహాదారులు రిటైర్డ్ ఎంఈఓ గంజి లక్ష్మీనారాయణ, బోయిని నారాయణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అనాథ విద్యార్థులకు చేయూత



మాట్లాడుతున్న సర్జన రమేశ్

నల్లబెల్లి: మండలంలోని నందిగామ, రంగాపురం ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న అనాథ విద్యార్థులకు ఎస్‌ఆర్‌ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయాన్ని గురువారం అందించారు. ఎస్‌ఆర్‌ఎం ఫౌండేషన్ అధ్యక్షుడు మహర్షి గోశాల చింతగట్టు భీమారం నిర్వాహకులు సర్జన రమేశ్ నందిగామ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న ఐదుగురు విద్యార్థులకు రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. రంగాపురం ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న ఇద్దరు విద్యార్థులకు రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చీకటి ప్రకాశ్, ప్రధానోపాధ్యాయులు యాకుబ్‌రెడ్డి, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దుకోవాలి



సర్పంచ్‌లు, అధికారులను సన్మానిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓలు

ఖానాపురం: ప్రతీ గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుకోవాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అన్నారు. ఈమేరకు ఇటీవల నేషనల్ పంచాయతీ అవార్డ్స్‌కు 14 గ్రామ పంచాయతీలు ఎంపిక కావడంతో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రశంసపత్రాలు, షీల్డ్‌లు అందించి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లను సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీల్లో తొమ్మిది రకాల పనుల్లో ఉత్తమ ప్రతిభ చూపిస్తున్నందున ఎంపిక కావడం జరిగిందన్నారు. ఇరవై జీపీలకుగాను 14 జీపీలు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. అవార్డులు వచ్చాయనే అలసత్వం ప్రదర్శించకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకుంటూ మరింత అభివృద్ధి సాధించేలా కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ సుమణవాణి, ఎంపీఓ పసరగొండ రవి, వైస్ ఎంపీపీ రామసహాయం ఉమారాణి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

జల సంపదను కాపాడుకోవాలి

వర్ధన్నపేట: జల సంపదను కాపాడుకోవాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భజలాలను పెంపొందించుకోవాలని మారి స్వచ్ఛంద సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ రాగి కృష్ణమూర్తి అన్నారు. గురువారం వర్ధన్నపేట ప్రభుత్వ పాఠశాలలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థిని విద్యార్థులకు పరుగు, క్విజ్, చిత్రలేఖనం, ముక్కాల పరుగు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నర్సయ్య, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నర్సింహమూర్తి ఎస్‌ఎంసీ చైర్మన్ బాల్నె రమేశ్, రాజు, మారి సంస్థ ప్రతినిధులు విజయలక్ష్మి, శ్యాంసుందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కస్తూర్బాలో 'పోషణ పక్వాడా'

చెన్నారావుపేట: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా చిరు ధాన్యాల ప్రాముఖ్యంపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పౌష్టికాహారం తీసుకోవాలని, శుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం పోషణ పక్వాడా ఆకారంలో విద్యార్థులు కూర్చున్నారు. ఈకార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జ్యోతి, సూపర్‌వైజర్‌లు రాధ, మంజుల, అంగన్‌వాడీ టీచర్లు విజయ, మంజుల, శౌరీలు, సరోజన, విజయలక్ష్మి, తదితరులు ఉన్నారు.



పోషణ పక్వాడా ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి

నర్సంపేట/నర్సంపేట రూరల్/గీసుకొండ/చెన్నారావుపేట: వివిధ మండలాల్లో భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్రోద్యమంలో ఆయన పాత్రను గుర్తు చేసుకున్నారు. నర్సంపేటలో.. సీపీఎం, ఎస్ఎఫ్ఐ, యూఎస్ఎఫ్ఐ, ఏబీఎస్ఎఫ్, ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో.. భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. నర్సంపేటలోని సర్వాపురంలోని కేఎస్‌ఆర్ మోడల్ స్కూల్‌లో ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజు గురుదేవ్, సుఖ్‌దేవ్ వర్ధంతి వేడుకలను గురువారం నిర్వహించారు. గీసుకొండ మండలంలోని మచ్చాపూర్‌లో ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే.. మనుగొండ ప్రభుత్వ పాఠశాలలో భగత్‌సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. గీసుకొండ మండల కేంద్రంలోని జాగృతి విద్యానికేతన్‌లో ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని జరుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థి సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.



చెన్నారావుపేట: ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో..



నర్సంపేట: పాత్ ఫైండర్ స్కూల్‌లో..



నర్సంపేట: నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు



గీసుకొండ: మనుగొండలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న స్థానికులు



నర్సంపేట రూరల్: పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏబీఎస్ఎఫ్ నాయకులు

ఒంటరి మహిళకు 'సఖి' ఆశ్రయం

దేశాయిపేట: దేశాయిపేట డౌన్‌లోని ఒక ఇంటి ఎదుట నాలుగు రోజులుగా నిస్సహాయ స్థితిలో ఒక మహిళ ఉందని డాక్టర్స్ కాలనీ -2 నుంచి వచ్చిన ఫోన్‌కాల్‌కు వరంగల్ సెంటర్ సఖి సెంటర్ కోఆర్డినేటర్లు స్పందించారు. ఈమేరకు సదరు మహిళకు గురువారం ఆశ్రయం కల్పించారు.



మహిళను చేరదీసిన సఖి సెంటర్ సిబ్బంది